క్లుప్తంగా

టీడీపీ, జనసేనల తీరు సరికాదు


మహ్మద్ ఆరిఫ్

రాజమహేంద్రవరం సిటీ: బీసీల సంక్షేమంపై మాట్లాడే నైతిక అర్హత తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులకు లేదని వక్ఫ్ బోర్డ్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఆరిఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజులుగా ఆ పార్టీల నాయకులు బీసీల సంక్షేమంపై, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ గందరగోళాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిర్వీర్యం చేసి, అనేక బీసీ హాస్టళ్లను మూసివేసి బీసీ విద్యార్థులకు తీరని అన్యాయం చేసినప్పుడు ఈ నాయకులు ఎందుకు నోరు మెదపలేదని ధ్వజమెత్తారు.

క్రీడా సామగ్రి అందజేత

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడిలోని సిటీ నగరపాలక సంస్థ యూపీ స్కూల్‌కు గురువారం కెనరా బ్యాంక్ జేఎస్ రోడ్ బ్రాంచి ఆధ్వర్యంలో సీఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా క్రీడా సామగ్రి అందించారు. క్రికెట్ కిట్, షటిల్ బ్యాట్, స్కిప్పింగ్ రోప్ తదితర వాటిని ప్రధానోపాధ్యాయుడికి కెనరా బ్యాంక్ మేనేజర్ జి.కృష్ణ అందజేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కంబాలచెరువు: రహదారి నిబంధనలు పాటించాలని, బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలంటూ గురువారం ఆర్యాపురంలోని చైతన్య స్కూలు విద్యార్థులు నగరంలో ర్యాలీ చేశారు. నెలవారీ స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. సీసీఈ ఇన్‌చార్జి రెహానా, ఏవో గోలి భద్రం, డీన్ రమేష్, సి ఇన్‌చార్జి మూర్తి నేతృత్వంలో ర్యాలీ జరిగింది. రహదారి నిబంధనలపై అవగాహన కల్పిస్తూ స్వీట్లు, పువ్వులు పంపిణీ చేశారు. ఏపీఎం చైతన్య, ఎంవీ సురేష్, రామాంజనేయులు, ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

శేషవాహనంపై వేంకటేశ్వరస్వామి


శేషవాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

ధవళేశ్వరం: కార్తిక ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం వేంకటేశ్వరస్వామి శేషవాహనంపై ఊరేగారు. ఏకాదశిని పురస్కరించుకుని గ్రామోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా శేషవాహనంపై ఊరేగిన స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దేవస్థానం మాజీ చైర్మన్ సాధనాల చంద్రశేఖర్ (శివ) తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కడియం: కడియపులంక హరిహర మహాక్షేత్రంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రముఖ నర్సరీ రైతు మార్గాని సత్యనారాయణ దంపతులు గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

బాల్య వివాహాలను అరికడదాం

రాజమహేంద్రవరం రూరల్: బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ కె.తిరుమలరావు అన్నారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు గురువారం కాతేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి, ఫేస్ బుక్ ఇన్‌స్టాగ్రామ్ వలన కలిగే అనర్థాలను వివరించారు. సైబర్ నేరాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. సెల్ ఫోన్లకు వచ్చే అనవసర లింక్‌ను క్లిక్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. హెచ్ఎం డి.అనిత పాల్గొన్నారు.

ఇసుక పేరుతో టీడీపీ దోపిడీ

కడియం: తెలుగుదేశం హయాంలోనే ఇసుక పేరుతో ప్రజలను దోచుకున్నారని వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ అన్నారు. ఉచిత పేరుతో రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున దోచుకున్నారన్నారు. ఇప్పుడు ప్రభుత్వం పారదర్శకంగా ఇసుక పాలసీని ప్రకటించి, అమలు చేస్తోందన్నారు.

వివాహిత ఆత్మహత్య

కంబాలచెరువు: కాతేరులోని శాంతిపురానికి చెందిన డి.మల్లేశ్వరి (45) అనే వివాహిత పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. దీనిపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అనుమానాస్పద కేసు నమోదైంది. మల్లేశ్వరి తరుచూ భర్తతో గొడవపడుతుండేది. అలాగే అప్పులు ఎక్కువగా చేసేది. ఈ నేపథ్యంలో భార్యాభర్తలకు ఈనెల 19న గొడవ జరిగింది. దీంతో మల్లేశ్వరి పురుగుల మందు తాగింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

పవిత్ర బంధానికి మరో 60 ఏళ్లు!


వెంకట నగరం సాయిబాబా గుడి వద్ద 60 ఏళ్ల నాటి వృక్షం

- 36 రోజుల ట్రీట్‌మెంట్‌తో భారీ వృక్షానికి పునరుజ్జీవం
- పనులకు శ్రీకారం చుట్టిన రాజమహేంద్రవరం ఐకాన్స్

రాజమహేంద్రవరం రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఒక వృక్షాన్ని రీప్లాంటేషన్ చేయనుంది. ఈ కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టింది. రూరల్ మండలం వెంకటనగరం సాయిబాబా గుడి వద్ద రోడ్డు వెడల్పులో భాగంగా సుమారు 60 ఏళ్ల వయసున్న చెట్టును తొలగించేందుకు మార్కింగ్ చేశారు. జమ్మి, రావి కొమ్మలతో ఉన్న ఈ చెట్టు ఎంతో పవిత్రమైందని పండితులు చెబుతున్నారు. ఇటువంటి మహత్తరమైన వృక్షానికి రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ 36 రోజులు ట్రీట్మెంట్ చేసి మరోచోట పాతనుంది. దీనిని వెంకట నగరం గోదావరి తీరంలో రీప్లాంటేషన్ చేస్తామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు తీగెల రాజా తెలిపారు. గోదావరిలో స్నానాలు ముగించుకున్న భక్తులు ఈ చెట్టును దర్శించుకుని, పూజలు చేసుకోవడానికి అనువుగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇందులో భాగంగా కొంతమూరు వేద పాఠశాల వ్యవస్థాపకులు గుళ్లపల్లి శ్రీరామచంద్రమూర్తి ఘనపాఠి, వేదపండితులు చేతుల మీదుగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రాజెక్ట్ చైర్మన్ ఆర్.దుర్గాప్రసాద్, రోటరీ క్లబ్ సెక్రటరీ పి.అనుకుమార్, ట్రెజరర్ గ్రంధి రాజా, డైరెక్టర్లు జీఎస్ఎస్ మూర్తి, పి.సాయి తాతారావు, తారకేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


రీప్లాంటేషన్ కోసం పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

భక్తులకు ఎస్వీజీజీ సంఘ్ విస్తృత సేవలు

- తిరుమలలో స్థలం మంజూరుకు కృషి
- ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో భక్తులకు శ్రీవాసవీ గంగా గోదావరి (ఎస్వీజీజీ) నిత్యాన్న సేవాసంఘ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్వీజీజీ నిత్యాన్న సేవా సంఘ్ చైర్మన్ ఎంవీవీఎస్ఎన్ మూర్తి (మన్యం బాబు), కార్యదర్శి ఎం.బ్రహ్మాజీ మాట్లాడుతూ తమ సంఘం 2010లో కేవలం 18 మంది సభ్యులతో ప్రారంభమైందని, ప్రస్తుతం 80 మంది సభ్యులతో పుణ్య క్షేత్రాలలో భక్తులకు సేవలందిస్తోందన్నారు. బెనారస్ (వారణాసి), షిరిడీలో భక్తులకు అల్పాహారం, భోజనం, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తోందన్నారు. శ్రీశైలం, తిరుపతి దేవస్థానాలకు వచ్చే భక్తులకు సేవలు అందజేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. శ్రీశైలంలో స్థలం కేటాయిస్తున్నారని, తిరుమల కొండపై భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తే అక్కడ కూడా తమ సంఘ్ ఆధ్వర్యంలో సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. దీనిపై ఎంపీ మాట్లాడుతూ సీఎం జగనన్న దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి, తిరుమలలో భవన నిర్మాణానికి తగిన స్థలం మంజూరు అయ్యేలా కృషి చేస్తానన్నారు. సమావేశంలో సంఘ్ చైర్మన్ శిఖాకొల్లి నరసింహారావు, కోశాధికారి చలువాది సూర్యనారాయణరావు, డైరెక్టర్లు బ్రహ్మాజీ, పి.హనుమంతరావు, జి.గోపాల్, బి.కుమార్, బి.రాంపండు, కె.శేషయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

సీఎం జగన్ పాలన సువర్ణ యుగం

- ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్
- ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సువర్ణ యుగాన్ని తలపిస్తోందని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. కాతేరులో సచివాలయం 3,4 నూతన భవనాలను, సచివాలయం 5 పరిధిలో వైఎస్సార్ విలేజ్‌హెల్త్ క్లినిక్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. కాతేరులో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం రూ.కోట్లు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.హనుమంతరావు, మాజీ సర్పంచ్ ఆచంట వెంకట సుబ్బారాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి తాటి కొండవిష్ణు, కాతేరు సొసైటీ చైర్మన్ ఆచంట కళ్యాణ్, సచివాలయ కన్వీనర్లు యెజ్జువాసు, రొంగల వెంకటేశ్వరరావు, చీకట్ల రంజిత్ కుమార్, నక్కా ధనరాజు, మద్దా దుర్గారావు, సురేంద్ర, గంగిపాముల సురేష్, యెజ్జు వాసు, గూడూరి సురేష్, దార్ల రామలింగేశ్వరరావు, పెనుమాక సునీల్, పార్టీ నాయకులు మానుకొండ వెంకటరావు, విన్నకోట రాజేశ్వరి, యడవల్లి దేవమాత పాల్గొన్నారు.



కాతేరులో సచివాలయం - 3 భవనాన్ని ప్రారంభిస్తున్న చందన నాగేశ్వర్

పాలవెల్లువ లక్ష్యాలను పూర్తి చేయాలి

సీటీఆర్ఐ: జగనన్న పాలవెల్లువ పథకం కింద డిసెంబర్ నెలాఖరులోగా జిల్లాలో పాడి గేదెల గ్రౌండింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ మాధవీలత సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, సమన్వయ అధికారులతో కలసి గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆమె పాలవెల్లువ పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రౌండింగ్ ప్రక్రియ కోసం మండలాలు, ఆర్‌బీకేల వారీగా కార్యాచరణ ప్రణాళికతో చర్యలు చేపట్టాలన్నారు. పాడి పశువుల కొనుగోలు కోసం లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసేలా బ్యాంకర్లందరికీ ఆదేశాలు జారీ చేస్తామన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం జిల్లా డీహెచ్‌ఓ ఎస్‌టీజీ సత్యగోవింద్, పీడీ వీణాదేవి, ఎల్‌డీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- 37వ డివిజన్‌లో గడప గడపకూ

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 37వ డివిజన్‌లో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందుకోవడంలో ఏమైనా సాంకేతిక పరమైన సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు సచివాలయ సిబ్బందితో కృషి చేయడం జరుగుతుందన్నారు. జగనన్నకు మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి మీ అందరి మద్దతు ఇవ్వాలని కోరారు. 37వ డివిజన్‌లోని 71, 72, 73 సచివాలయాల పరిధిలో పర్యటించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ నాయకులు మజ్జి అప్పారావు, బర్రే కొండబాబు, సబ్బారపు సూరిబాబు, బాలాజీ రెడ్డి, చోడదాసి సుందర్ సింగ్, నామన వాసు, దుంగ మంగాలక్ష్మి పాల్గొన్నారు.


ప్రజలకు పథకాలను వివరిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

చేనేత, హస్తకళల ప్రదర్శన ప్రారంభం

సీటీఆర్ఐ: స్వదేశీ హ్యాండీ క్రాఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో జాంపేట ఉమా రామలింగేశ్వర కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళల ప్రదర్శనను గురువారం రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చేనేత హస్తకళలు దేశ వారసత్వ సంపద అని, ప్రజలు వీటిని విరివిగా కొనుగోలు చేసి చేనేత కార్మికులను, హస్తకళాకారులను ప్రోత్సహించాలన్నారు. ఈ ప్రదర్శనలో 20 నుంచి 30 శాతం తక్కువ ధరలకు వస్తువులు లభిస్తున్నాయన్నారు. నిర్వాహకుడు చిరంజీవి రాంబాబు మాట్లాడుతూ డిసెంబర్ 5వ తేదీ వరకూ ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు విక్రయాలు జరుగుతాయన్నారు. వివిధ రకాల చీరలు, దుప్పట్లు, వన్ గ్రాము గోల్డ్ నగలు, బొమ్మలు లభిస్తాయన్నారు.


ఎగ్జిబిషన్‌లో చీరలను పరిశీలిస్తున్న షర్మిలారెడ్డి

చేపల పెంపక కేంద్రంతో ఒప్పందం

కంబాలచెరువు: ఏపీ రాష్ట్ర చేపల పెంపకం కేంద్రం, ఆర్ట్స్ కళాశాల మధ్య ఒప్పందం కుదిరినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు గురువారం తెలిపారు. జలచరాలను గుర్తించి సంరక్షించేందుకు మరింత సమగ్రమైన, సమర్థవంతమైన విధానాన్ని రూపొందించుకోవడమే దీని లక్ష్యమన్నారు. ఈ నేపథ్యంలో కళాశాలలోని జంతు శాస్త్ర విభాగం, కడియంలోని రాష్ట్ర చేపల పెంపకం కేంద్రం పరస్పరం సహకరించుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. యూజీ, పీజీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు చేయడానికి ఇది ఒక మంచి అవకాశమన్నారు. ఎంవోయూలో ప్రధానంగా పరిశోధన సహకారం, వనరుల భాగస్వామ్యం, పరిరక్షణ ప్రయత్నాలు, నైపుణ్యం, నాలెడ్జ్ మార్పిడి, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్, ఆర్థిక ప్రయోజనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జువాలజీ విభాగం ఇంచార్జి కె.దుర్గారావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాలను చూపుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు

క్షతగాత్రులకు సాయం.. ఎమ్మెల్యే రాజా మానవత్వం

- సొంత వాహనంలో ఆస్పత్రికి తరలింపు
- మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచన

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సాయమందించారు. తన సొంత వాహనంలో వారిని ఆసుపత్రికి తరలించారు. వైద్యులకు స్వయంగా ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. బొబ్బిలంక గ్రామానికి చెందిన కమిడి సత్యనారాయణ, కమిడి లక్ష్మి రాజమహేంద్రవరం నుంచి తమ స్వగ్రామం వెళుతున్నారు. ఊటా సత్యనారాయణ మోటార్ సైకిల్‌పై తొర్రేడు వైపు వస్తున్నారు. కాతేరు దాటిన తరువాత తిరుమల స్కూల్ సమీపంలో వీరి బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కమిడి సత్యనారాయణ, లక్ష్మిలకు స్వల్ప గాయాలు కాగా, ఊటా సత్యనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో సీతానగరం వైపు వెళుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా.. క్షతగాత్రులను చూసి చలించిపోయారు. వెంటనే కారు ఆపి కిందికి దిగి స్థానికులను ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులు ముగ్గురినీ తన సొంత వాహనంలో గన్‌మన్ సాయంతో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు.


ఘటనా స్థలంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఆడుదాం ఆంధ్రకు సన్నద్ధం కావాలి

రాజమహేంద్రవరం రూరల్: త్వరలో జరగబోయే ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలకు సన్నద్ధం కావాలని మండల కమిటీ చైర్‌పర్సన్, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అన్నారు. హుకుంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన అధ్యక్షతన మండలస్థాయి ఆర్గనైజింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ పైడి చిన్నారావు, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్, మండల విద్యాశాఖాధికారి-2 చందుకుమార్, ఈవీపీఆర్ అండ్‌ఆర్డీ తాడి కృష్ణ, మండల క్రీడా అధికారి ఇబ్రహీం పాల్గొన్నారు.

3న మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

కంబాలచెరువు: జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) డిసెంబర్ మూడున జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం గురువారం తెలిపారు. హాల్ టిక్కెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.గవ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

డిసెంబర్ 30న ధర్నా

మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాలని కోరుతూ డిసెంబర్ 30న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నా జరుగుతుందని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయకర్, షరీఫ్ తెలిపారు. స్థానిక జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో ఉద్యమ కార్యచరణకు సంబంధించిన పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు.

నిధులు విడుదల చేయాలి

ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం రాజమండ్రి డివిజన్ సమావేశం గురువారం సాయంత్రం స్థానిక ఎస్‌కేవీటీ హైస్కూల్లో జరిగింది. డివిజన్ ప్రధానోపాధ్యాయ సంఘం అధ్యక్షురాలు రావి విజయదుర్గ అధ్యక్షత వహించారు. సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు కోలా సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కేవీ రమణారావు మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయాలన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు దేవాంగుల పేటలో గంగమాంబ సహిత బసవేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి గురువారం శంకుస్థాపన జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీజీఅండ్‌బీసీ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు నిర్వహించాలి

సీటీఆర్ఐ: విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు నిర్వహించాలని జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భీమడోలు కిరణ్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మాధవీలతకు వినతి పత్రం అందించారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం గురువారం స్థానిక ఆంధ్రకేసరి డిగ్రీ కాలేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఎదురయ్యే లోపాలను పరిష్కరించడానికి సీజీఆర్ఎఫ్ ఏర్పాటు చేశారన్నారు. బిల్లింగ్‌లో లోపాలు, విద్యుత్ తీగలు (కేబుల్స్) మరమ్మత్తులు, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులు, కొత్త వాటిని అమర్చడం, మీటర్లు కాలిపోవడం, విద్యుత్ ఓల్టేజ్ హెచ్చుతగ్గులు, విద్యుత్ మీటర్ల లోపాలు, కొత్త సర్వీసులు, అదనపులోడు మంజూరు, యజమాని పేరు, కేటగిరి, ఇతర మార్పిడి అంశాలు తదితర వాటిని సీజీఆర్ఎఫ్ పరిష్కరించి న్యాయం చేస్తుందన్నారు. అనంతరం మోరంపూడిలోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వి. జనార్దనరావు (మెంబర్, టెక్నికల్), ఎస్.హరిబాబు (మెంబర్, ఫైనాన్స్), ఆర్.సురేంద్ర కుమార్ (మెంబర్, ఇండిపెండెంట్), సూపరింటెండింగ్ ఇంజినీర్ టీవీఎస్ఎన్ మూర్తి, ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్, టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.ఉషారాణి పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ సత్యనారాయణ

ఆర్డీవోగా మల్లిబాబు సేవలు అభినందనీయం

- కలెక్టర్ మాధవీలత
- కలెక్టరేట్‌లో ఆత్మీయ వీడ్కోలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కొవ్వూరు ఆర్డీవోగా ఎస్.మల్లిబాబు అందించిన సేవలు అభినందనీయమని కలెక్టర్ మాధవీలత అన్నారు. డిప్యూటీ చీఫ్ ఎలక్షన్ అధికారిగా బదిలీపై వెళుతున్న ఆయనను గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఘనంగా సత్కరించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ మల్లిబాబు జిల్లాలో సమర్థవంతంగా పనిచేసి, అందరి మన్ననలు పొందారన్నారు. జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ రెవెన్యూశాఖ పరంగా ఎంతో అనుభవం కలిగిన మల్లిబాబు.. జిల్లా నుంచి బదిలీ కావడం మనకు లోటు అన్నారు. ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మల్లిబాబు మాట్లాడుతూ జిల్లాలో 30 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. తనకు సహకరించిన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, డీఆర్వో జి.నరసింహులు, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, కొవ్వూరు ఆర్డీవో కృష్ణ నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సరళ వందనం, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భాను ప్రకాష్ పాల్గొన్నారు.


మల్లిబాబును సత్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

పథకాలతో అందరికీ ప్రయోజనం

- వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో అన్ని వర్గాలకూ ప్రయోజనం కలుగుతోందని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. నగరంలో ఐదు సచివాలయాల పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 84వ సచివాలయం పరిధిలో సుమారు రూ.19.48 కోట్ల మేర లబ్ధి అందజేశామన్నారు. జాంపేట సచివాలయం-1 పరిధిలో సుమారు 20.72 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయని, ఇదే డివిజన్లో సుమారు రూ.2.28 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. లింగంపేట 66వ సచివాలయం పరిధిలో సుమారు రూ.22 కోట్లు విలువైన పథకాలు అమలు చేశామన్నారు. 8వ డివిజన్‌లోని 14వ సచివాలయం పరిధిలో సుమారు రూ.9.63 కోట్ల లబ్ధి లభించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పోలు విజయలక్ష్మి, పెంకే సురేష్, మజ్జి అప్పారావు, అర్జరపు వాసు, బర్రే కొండబాబు, మానే దొరబాబు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమపథకాలు నిరంతరం అందాలంటే మళ్లీ ఆయననే సీఎంగా గెలిపించుకుందామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర అన్నారు. నగరపాలకసంస్థ పరిధి 20వ డివిజన్‌లోని కేసరి క్లబ్ ఏరియా 48వ వార్డు సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఆయన, డివిజన్ల జేసీఎస్ ఇన్‌చార్జి కొప్పినీడి ప్రసాద్‌బాబు(రాజమౌళి), సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. మింది నాగేంద్ర మాట్లాడుతూ సచివాలయం పరిధిలో రూ.9.08 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందజేశామన్నారు. సచివాలయ కన్వీనర్లు దళవ కోటేశ్వరరావు, తుమ్మల గణపతి, కిలిమి నారాయణరెడ్డి, రాజశేఖరరెడ్డి, విశ్వేశ్వరాలయ చైర్మన్ ఎన్‌డీ శ్రీనివాస్, డైరెక్టర్లు కాపు భాను, సోమశేఖర్, నరసింహులు, అంజిబాబు, అనసూరి రమణ, నందిగం సాయి, చైతుఫ్రెండ్స్‌సర్కిల్, కన్నమాంబ గుడి చైర్మన్ దుంపాచంద్రారెడ్డి, ఇన్నీసుపేట బ్యాంకు వైస్ చైర్మన్ అన్నపూర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత జగన్

ధవళేశ్వరం: సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి పేర్కొన్నారు. గురువారం ధవళేశ్వరం సచివాలయం-2 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు తలారి వరప్రసాద్,పేర్ల దుర్గాప్రసాద్, పసుపులేటి దేవి, చాటకాల చంటి, పంచాయతీ కార్యదర్శి డి సూరిబాబుతో కలిసి తాటికొండ విష్ణుమూర్తి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల డిజిటల్ బోర్డు ఆవిష్కరించారు. విష్ణుమూర్తి మాట్లాడుతూ ధవళేశ్వరం సచివాలయం-2 పరిధిలో రూ.30 కోట్లతో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారన్నారు. ఎన్‌వీ శేఖర్, పండెల్ల భానుప్రసాద్, దేవులపల్లి సరితారాణి, గునిపే అశోక్, చప్పిడి జ్యోతి, కేతా సాయి పాల్గొన్నారు.


వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్


48వ సచివాలయంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న మింది నాగేంద్ర తదితరులు


ధవళేశ్వరం సచివాలయం-2 వద్ద డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న విష్ణుమూర్తి తదితరులు

ప్రమాదాల నివారణకు చర్యలు

ధవళేశ్వరం: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. జాతీయ రహదారిపై హార్లిక్స్ ఫ్యాక్టరీ నుంచి ధవళేశ్వరం వైపు వెళ్లే యూటర్న్ వరకూ ఉన్న బ్లాక్ స్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ప్రమాదాలను అరికట్టేందుకు తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై సౌత్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవికి సూచనలు ఇచ్చారు. రేడియం స్టిక్కర్లతో స్టాపర్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడానికి నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సంప్రదిస్తున్నామన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

కడియం: మండలంలోని వేమగిరిలో వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి రావిపాటి రామచంద్రరావు దంపతులు నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయం మూడో వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు కొత్తూరి సతీష్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రావిపాటి ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. స్వామిని ఎంపీ మార్గాని భరత్‌రామ్, పార్టీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ దర్శించుకున్నారు. యాదల సతీష్‌చంద్రస్టాలిన్, దొంతంశెట్టి వీరభద్రయ్య, ఈలి గోపాలం, తిరుమలశెట్టి శ్రీను, కొత్తపల్లి మూర్తి తదితరులు పాల్గొన్నారు.